మెంథా తుఫాన్‌పై జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం

మంత్రి సంధ్యారాణి, ఇంచార్జి మంత్రి అచ్చెన్నాయుడులు వెల్లడి

విశాలాంధ్ర-పార్వతీపురం : మెంథా తుఫాన్‌పై జిల్లా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సోమవారం గ్రీవెన్స్ రద్దు చేయాలని తెలిపారు.అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు రా.అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా అవసరమైతే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలన్నారు.వాగులు వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యలు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని, తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని మంత్రి సంధ్యారాణి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మెంథా'తుఫాన్ ఎదుర్కొనేందుకు అధికార యంత్రంగా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మెంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో, ఇతర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాయుగుండం 28 ఉదయం నాటికి తీవ్రమైన తుఫానుగా మారుతుందని, ఈసమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ-ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు తుఫాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర ప్రాంతాలకు చేరుకొని జిల్లాల్లోని తుఫాన్ ప్రభావాన్ని పర్యవేక్షణ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ శాఖ, ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని అధికారులను నిర్దేశించారు. చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, నీటి సరఫరా విభాగం అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

138 జీవోను రద్దు చేయాలి

- నవంబర్ 4న విజయవాడ ధర్నా కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధం కావాలి
- ప్రభుత్వ ఆసుపత్రుల వెన్నెముకగా పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు - కానీ గుర్తింపు ఎక్కడ...?
- ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ సూటి ప్రశ్న

విశాలాంధ్ర-బెలగాం : ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రుల పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, పెస్ట్ కంట్రోల్ (కీటక నిరోధక) సిబ్బంది ప్రస్తుతం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి వ్యవస్థ సజావుగా నడవడానికి వీరి కృషి అత్యంత అవసరం అయినప్పటికీ, వారి జీవన పరిస్థితులు మాత్రం దయనీయంగా ఉన్నాయని పార్వతీపురం మన్యం జిల్లా ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ రోగుల మలినాలను, వ్యర్థాలను శుభ్రం చేస్తూ, రోగాల వ్యాప్తిని అడ్డుకుంటున్న పారిశుద్ధ్య సిబ్బందికి తగిన వేతనాలు, భద్రతా పరికరాలు లేకపోవడం తీవ్రమైన సమస్యగా మారిందని, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న వీరికి ప్రభుత్వ ఉద్యోగుల్లా స్థిరమైన వేతనం లేదా భద్రత ఉండటం లేదన్నారు. సెక్యూరిటీ సిబ్బంది విషయానికి వస్తే వారు 24 గంటలూ అప్రమత్తంగా ఉండి రోగుల, వైద్య సిబ్బంది యొక్క రక్షణలో కీలకంగా ఉంటున్నారు కానీ వారికి పని సమయాలు ఎక్కువగా ఉండడం, తగినంత విశ్రాంతి లేకపోవడం వలన శారీరక, మానసిక ఒత్తిడి పెరుగుతోందని, పెస్ట్ కంట్రోల్ కార్మికులు దోమలు, ఈగలు, చీమలు వంటి కీటకాలను నిర్మూలించడం ద్వారా ఆసుపత్రి వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు కానీ వారికి కూడా సరైన రసాయన రక్షణ పరికరాలు (మాస్కులు, గ్లోవ్స్, సేఫ్టీ కిట్) ఇవ్వకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు.

కాంట్రాక్టు విధానం - మూలకారణం : ఈ మూడు విభాగాల్లో దాదాపు 90శాతం మంది కాంట్రాక్టు ఆధారంగా పనిచేస్తున్నారని నెలవారీ జీతాలు ఆలస్యమవడం, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు లభించకపోవడం వలన కార్మికుల్లో ఆగ్రహం పెరుగుతోందని ఉద్యోగ భద్రత లేకపోవడంతో తక్కువ జీతాలతో నైనా పని కొనసాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు.

కార్మికుల డిమాండ్లు : పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికుల కొన్ని ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని, కనీస వేతనం చట్టం ప్రకారం తగిన వేతనం ఇవ్వాలని, భద్రతా పరికరాలు, యూనిఫామ్, ఆరోగ్య బీమా అందించాలని, నెలవారీ జీతాలు ఆలస్యం కాకుండా సమయానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్యానికి వీరే కాపరులు : వైద్యులు, నర్సులు ప్రజారోగ్యానికి ప్రత్యక్షంగా సేవలందిస్తే, వీరు పరోక్షంగా ఆసుపత్రి పరిశుభ్రతను కాపాడుతున్నారు కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం, కాంట్రాక్టు విధానం కారణంగా వీరి సేవలు అణగారి పోతున్నాయని, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే వీరి స్థితిగతులను సరిచేయడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. చివరగా ఈ అంశంపై సిపిఐ, కార్మిక సంఘాలు కూడా ప్రభుత్వాన్ని ఉద్దేశించి స్పందిస్తున్నాయని వీరి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వకపోతే సమ్మెలు, నిరసనలు తప్పవని కుమార్ హెచ్చరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటుపరం ఆలోచన తిప్పికొట్టండి

విశాలాంధ్ర-కురుపాం : రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో నడిపేందుకు చేస్తున్న ఆలోచన లును ప్రజలు తిప్పికొట్టాలని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి కోరారు. ఆదివారం కురుపాం మండలంలోని బియ్యాలవలస, శివన్నపేటలలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేయడం వల్ల జరిగే నష్టం ప్రజలకు వివరించి సంతకాలు సేకరణ చేపట్టారు. పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాల నడపడం వలన వైద్య విద్య ఫీజులు మోత మోగుతుందని, ఉచిత వైద్యం మరింత భారం అవుతోందని అన్నారు. మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, జడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ ఆదిల్, ఎంపీటీసీలు స్వామియాజులు, బంగారు నాయుడు, సంతోషి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో రూ.10వేలతో రోడ్డు ఏర్పాటు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గుచ్చిమి గ్రామంలోని రాష్ట్రీయరహదారికి ప్రక్కనఉన్న ఎస్సీ కాలనీలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడానికి టీడీపీ నేత, గుచ్చిమి సహకార సంఘం అధ్యక్షులు బూరాడ చిరంజీవి దగ్గరుండి సుమారు పదివేల రూపాయలు ఖర్చుచేసి జెసిబితో తుప్పలు డొంకలు కొట్టించి, రోడ్డును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ఆదేశాలు, సూచనలు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని చిరంజీవి తెలిపారు. ఈకార్యక్రమంలో చిరంజీవితో పాటు సర్పంచ్ మర్రాపు ధనుంజయనాయుడు, సహకార సంఘం డైరెక్టర్ మరిశర్ల సంజీవినాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర సూచనలు మేరకు ఎన్నో ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ ఇళ్ళ వెనుకవైపు రోడ్డును నిర్మించడంపట్ల విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన సోమేశ్వరరావు, హరిబాబు, అశోక్, తాతబాబు, ఈశ్వర రావు తదితరులు, మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సీసీ రోడ్డును కూడా నిర్మించి శాశ్వతముగా సమస్యను పరిష్కారం చేయాలని వారంతా విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే విజయ్ చంద్ర దృష్టికి తీసుకువెళ్లి సీసీ రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని చిరంజీవి తెలిపారు.

కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

వైసీపీ మండల అధ్యక్షుడు గణబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిలువరించేందుకు కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వైసిపి మండల అధ్యక్షుడు పాంగి గణబాబు అన్నారు. స్థానిక జడ్పిటిసి పోతురాజు బాలయ్య, పార్టీ నాయకులతో కలసి మండలంలోని పలు పంచాయతీలలో కోటి సంతకాల సేకరణకై ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ క్రమంలో లంబసింగి పంచాయతీలో ఆ పంచాయతీ సర్పంచ్ కొర్ర శాంతి కుమారి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు రావుల నాగమణి, పీసా కమిటీ మండల కన్వీనర్ సరమండ నాగరాజు, ఆ పంచాయతీ, మాజీ ఎంపీటీసీ దేపూరి గిరిబాబు సహా ఆ పంచాయతీలోని వైసిపి నాయకులు, కార్యకర్తల వద్ద సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు సూచనలతో మండలంలో కోటి సంతకాల సేకరణను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారు. పేద ప్రజల ఆశా కిరణమైన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను మన్య ప్రాంతంలోని ప్రతి ఒక్కరు వ్యతిరేకిస్తున్నారని, దీనివలన సంతకాల సేకరణ వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంతకాల సేకరణతో కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

కలెక్టర్ వెల్లడి

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లాలో మోస్తారు నుండి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో సోమవారం జరగనున్న పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను రద్దుచేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంథాన్ తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచనలమేరకు ఈ నిర్ణయంను తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. దీన్ని ప్రజలు గమనించి సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలపై వినతులు అందజేయడానికి ప్రధానం కేంద్రానికి రావద్దని జిల్లా కలెక్టర్ తెలిపారు. తుఫాన్ ప్రభావంపై, తీసుకోవలసిన చర్యలపై మంత్రి సంధ్యారాణి జిల్లాఅధికారులతో చర్చించినట్లు తెలిపారు.

ప్రభుత్వ నిబంధనలు నారాయణ విద్యాసంస్థలకు వర్తించవా : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : సెలవు దినములో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలనిఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న నారాయణ విద్యాసంస్థ పై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు నారాయణ విద్యాసంస్థలకు వర్తించవా అని ప్రశ్నించారు. మార్కులే ధ్యేయంగా విద్యార్థులకు సెలవు దినములో కూడా తరగతులు నిర్వహించి మానసిక ఒత్తిడికి గురి చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇలా ఒత్తిడికి గురి చేయడం వలనే అనేకమంది విద్యార్థులు సూసైడ్లు చేసుకుంటున్నారని, ఎక్కువగా మరణాలు ఇలాంటి విద్యాసంస్థల్లోనే ఎక్కువ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అనేక కోర్సుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి అధిక ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. బాధ్యతారహితంగా ఉన్న విద్యాశాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు

అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : జీఎస్టి సంస్కరణలతో పేద, మధ్యతరగతి వర్గాల వారికి పూర్తిస్థాయిలో మేలు చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆదివారం తెలుగు దేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు చెడ్డ లక్ష్మి ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 15 వేల వరకు ఆధ అవుతుందన్నారు. 99% వస్తువులు, సేవలు పన్ను రహితం చేశారన్నారు. ఒకవేళ ఉన్న ఐదు శాతం లేదా 18 శాతం జీఎస్టీ మాత్రమే విధించారు అన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ తో ఏపీలో డబల్ బెనిఫిట్స్ దక్కె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దన్నే రావు, తెలుగుదేశం పార్టీ టీఎన్టియుసి ప్రధాన కార్యదర్శి స్వామి, తెలుగు రైతు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బుజ్జిబాబు, జనసేన జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షుడు నాగరాజు, అనంతగిరి సూపర్ ఎంపీటీసీ దున్ను, మండల టిడిపి క్లస్టర్ బూత్ ఇన్చార్జి రాజ్ కుమార్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ప్రసాద్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి సురేష్, జక్కయ్య, గోవర్ధన్, పవన్ కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర- జిమాదుగుల : వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు అక్టోబర్ 26 నుండి 29 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, పంచాయతీలోని అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని సొలభం పంచాయతీ సర్పంచ్ ఐ. హనుమంతరావు 28, 29 తేదీలు కీలకం. ఈ సమయంలో తుఫాన్ ఆంధ్రప్రదేశ్ తీరం దాటే అవకాశం ఉందని సర్పంచ్ పేర్కొన్నారు.గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులను సురక్షితంగా ఉంచాలి మరియు పాడి పశువులను లోతట్టు ప్రాంతాల్లో గడ్డలు వాగులు కలిగిన ప్రాంతంలో చెట్లు క్రింద వెళ్ళరాదు అని ఆయన సూచించారు ."ప్రాణం, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని పంచాయతీ సచివాలయం సిబ్బందికి, వార్డ్ సభ్యులకు, పిసా కమిటీలను సర్పంచ్, అధికారులను ఆదేశించారు.

మెడికల్ కలశాలలను ప్రైవేట్‌పరం చేస్తే ఊరుకోం

అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వలరాజు

విశాలాంధ్ర-పాడేరు : మెడకల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే ఊరుకునేది లేదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వలరాజు అన్నారు. విద్యారంగ సమస్యలపై అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఈనెల 22 నుంచి నవంబర్ 12 వరకు బస్సుయాత్ర లో భాగంగా అల్లూరి జిల్లా పాడేరులో బస్సు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ గిరిజన, పేద విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి లేకుండా పరిపాలన చేస్తుందని విమర్శించారు. పి పి పి విధానం అమలు చేసి పేద విద్యార్థులకు వైద్య పట్టాను దూరం చేయాలనీ భావిస్తుందన్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్మెంట్ రూ. 6400 కోట్లు బకాయి విడుదల చేయకుండా మోసం చేస్తుందన్నారు. ఎంతోమంది గిరిజన విద్యార్థిని, విద్యార్థులు అనారోగ్యల బారిన పడి మృత్యువాత పడుతున్న కూటమి ప్రభుత్వం గిరిజన హాస్టల్స్ లో హెల్త్ అసిస్టెంట్, వాచ్మెన్ లను నియమించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నెలకు రూ. 3000 లు పెంచి పౌష్టికహారం అందించి న్యాయం చేయాలన్నారు. జిఓ నెం. 77, 108 ని తక్షణమే రద్దు చేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్షిప్ (పి పి పి) రద్దు చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాల లను ప్రభుత్వమే నడిపించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటం చేస్తామని కూటమి ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఫణింద్ర, కుళాయి స్వామి, నాగభూషణం, మస్తాన్, కృష్ణ, తనీష్, జగదీశ్, శ్రీనివాస్ రెడ్డి, అబ్బులు, రాజశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

137 కేజీల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్‌బాబు

విశాలాంధ్ర-చింతపల్లి : గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి సుమారు 137 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక కారు రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగిందని చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు అన్నారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ముందస్తు సమాచారం మేరకు అన్నవరం పోలీసులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. అన్నవరం ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో అన్నవరం పోలీసులు లోతు గెడ్డ వంతెన వద్ద సుమారు మూడున్నర గంటల సమయంలో మాటు వేయడంతో పాటు వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న ఏపీ 39 డీజే 4656 నంబర్ గల కారు, రెండు ద్విచక్ర వాహనాలను (పల్సర్, హెూండా) తనిఖీ చేయగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గమనించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో కారులో ఒక వ్యక్తి, పల్సర్ వాహనంపై ఇరువురు, హెూండా వాహనంపై ఇరువురు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. వాహనాలు తనిఖీ చేసేందుకు పోలీసులు వాహనాలను ఆపగా ఇరువురు యువకులు పరారయ్యారన్నారు. మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన గంజాయి మూటలను పరిశీలించగా కారులో మూడు గంజాయి మూటలు, పల్సర్, హెూండా వాహనాలపై చెరొక మూట కలిపి మొత్తం ఐదు మూటలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఐదు మూటలలో ఉన్న గంజాయిని తూకం వేయగా మొత్తం 137 కేజీలు ఉందన్నారు. ఈ గంజాయి తో పాటు, గంజాయి రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి రవాణాకు ఉపయోగించిన బ్రిజా కారు, రెండు ద్విచక్ర వాహనాలను, వారి వద్ద ఉన్న మూడు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అరెస్టు కాబడిన ముద్దాయిలలో ఇరువురు చింతపల్లి మండలానికి చెందినవారు కాగా, మరొకరు జీకే వీధి మండలానికి చెందిన వ్యక్తి అని సీఐ తెలిపారు. పరారైన ఇద్దరు ముద్దాయిలది కూడా చింతపల్లి మండలమే అన్నారు. ఈ గంజాయిని నర్సీపట్నంకు చెందిన ఒక వ్యక్తికి తీసుకెళ్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. దీని వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులను కూడా అరెస్టు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నవరం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మండల తహసిల్దార్ హెచ్.అన్నాజీరావు

విశాలాంధ్ర-జీకే విధి : తుఫాను కారణంగా మూడు రోజుల భారీ వర్షాలు నేపథ్యంలోజిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయబడవని, పంచాయతీ కేంద్రంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలని తాసిల్దార్ హెచ్ అన్నజి రావు సూచించారు. తుఫాను కారణంగా మూడు రోజుల భారీ వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించలన్నారు. దూరపు ప్రయాణాలు ఉంటే విరమించుకోవాలన్నారు. ఏ అత్యవసర సందర్భం వచ్చిన గ్రామ విఆర్ఓ ను సంప్రదించి తక్షణ సాయం పొందవలసిందిగా ఆయన కోరారు.

మాజీ ఉపరాష్ట్రపతి చేతులమీదగా ఉత్తమ కాఫీ రైతు అవార్డు అందుకున్న ఆడప లక్ష్మి

విశాలాంధ్ర-జీకే విధి : పద్మ శ్రీ ఐ వి సుబ్బారావు రైతు నేస్తం, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతుల కు అందిస్తున్న పురస్కారాలలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి మండలం జర్రెల పంచాయతీకి చెందిన నిట్ట మామిడి పాలెం గ్రామ కాఫీ రైతు అడపా లక్ష్మి, స్వర్ణ భారతి ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం న మాజీ ఉప రాష్ట్ర పతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా ఉత్తమ కాఫీ రైతు అవార్డు అందుకున్నారు.

జీకేవీధి సీఐగా వరప్రసాద్‌ను కొనసాగించాలని డిమాండ్

విశాలాంధ్ర - సీలేరు : జీకేవీధి సిఐగా వరప్రసాద్‌ను కొనసాగించాలని టీడీపీ, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో జీకేవీధి సీఐగా మండల ప్రజలతో మమేకమై అందరి సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. గిరిజన గ్రామాలలో సమస్యలను తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేశారన్నారు. గిరిజన సమస్యలపై ముఖ్యంగా రహదారులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. దారకొండలో మండల కేంద్రం ఏర్పాటుకు చక్కని సలహాలు, సూచనలు ఇచ్చేవారని, ఈ ప్రాంతం అభివృద్ధి పట్ల ఎంతో చొరవ చూపిన ఇటువంటి అధికారులు అవసరం ఎంతైనా ఉందన్నారు. జీకేవీధి సిఐగా వరప్రసాద్‌ను కనీసం ఆరు నెలలైనా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి, టీడీపీ నాయకులు పోతరాజు కృష్ణ, సుందరరావు, తగ్గి చంటిబాబు, పోతురాజు, సిపిఐ మండల కార్యకర్త కవర్ల భగవాన్ కోరారు.

దారకొండను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని భారీ ర్యాలీ

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దారకొండలో ఆదివారం దారకొండను ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి వినాయక గుడి వరకు వివిధ పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, గిరిజన రైతులు, వివిధ సంఘాల నాయకులు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేశారు. దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల, సీలేరు పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ర్యాలీలో పాలుపంచుకున్నారు. ప్రస్తుతం ఉన్న జీకేవీధి మండలానికి వెళ్లాలంటే సుమారు 35 కిలోమీటర్ల దూరం, పైగా ఘాట్ రోడ్డులో ప్రయాణించాల్సి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దారకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఈ పంచాయతీల ప్రజలకు పరిపాలన, అభివృద్ధి విషయంలో అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కొత్త మండలంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి వేగవంతమవుతుందని వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు తమ ప్రాంత సమస్యలను అర్థం చేసుకొని తక్షణమే దారకొండలో మండలాన్ని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ అధ్యక్షులు శోభ జగన్, సీపీఐ నాయకులు సుంకరి విష్ణుమూర్తి, దారకొండ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పోతురాజు కృష్ణారావు, దారకొండ ఎంపీటీసీ మాడి రామన్న, పోత్తూరు రాంబాబు, జోరంగి వెంకటరమణ, జర్రిల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుని గుర్తించి సమాచారం ఇవ్వండి

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల సింగన్నగూడెం గ్రామమ దగ్గరలో గల రోడ్డు పక్కన ఒక గుర్తు తెలియని, సుమారు 50 సంవత్సరాలు వయసు గల వ్యక్తి అనారోగ్యంతో, లేవనేని స్థితిలో ఉండగా, గ్రామస్తులు చింతూరు గవర్నమెంట్ హాస్పిటల్లో జాయిన్ చేయగా, చికిత్స పొందుతూ ది. 24.10. 2025 తారీకు సాయంత్రం 5:45 నిమిషములకు మరణించడం జరిగింది. ఈ విషయమును చింతూరు గ్రామ విఆర్ఓ మానే లక్ష్మయ్య రిపోర్టు ద్వారా తెలియజేయగా, చింతూరు ఎస్ఐ పి రమేష్ అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి ఎస్సై పి రమేష్ దర్యాప్తు చేయుచున్నారు. దర్యాప్తులో భాగంగా మృతుడు సుమారు సంవత్సర కాలముగా చింతూరు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిసినది.సదరు వ్యక్తి ఆచూకీ తెలిసినవారు చింతూరు పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వవలసిందిగా తెలిపారు.

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ సంతోష్‌కుమార్

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని ప్రజలకు, మత్స్యకారులకు, వ్యవసాయ కూలీలకు రాబోవు తుఫాను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పనులు నిర్వర్తించుకోవాలని యస్ఐ సంతోష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళవద్దని, అదేవిధంగా ప్రజలు శబరి, గోదావరిలో స్నానం చేయడానికి గోదావరికి వెళ్లవద్దని, వ్యవసాయ కూలీలు అధిక ప్రవాహం ఉన్నప్పుడు అన్నవరం వాగు దాటవద్దని అని తుఫాన్ కారణంగా ప్రస్తుతం పోచవరం టూరిజం బోటింగ్‌ని లిపి వేయడం జరిగిందని ఆయన తెలియజేశారు.

గిడ్డి ఈశ్వరి అండదండలతో గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు

- గిరిజన హక్కులు చట్టాలలు కాపాడాల్సింది పోయి కొమ్ము కాయడమా..?
- గిరిజన ప్రజాసంఘాలు మండిపాటు

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతం దినదిన అభివృద్ధితో పాటు అక్రమ నిర్మాణాలు కూడా జోరందుకున్నాయి. అక్రమ నిర్మాణాలకు బినామీ రాజాలు రాజ్యమేలుతున్నారు. అందుకే గిరిజనేతరులు ఆకడాలు మితిమీరిపోతుంది. గిరిజనుల హక్కులు చట్టాలు కాపాడాల్సింది పోయి కంచె చేను మేసినట్లు మన గిరిజనులే బినామీలుగా ఉంటూ 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ చీకటి రాజ్యం ఏలుతున్నారు. ఇందుకు ఉదాహరణగా చెప్పాలంటే పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేర్లపబ్లిక్ చెబుతూ నిర్మాణాలు చేయడం వెనక ఆంతర్యం ఏమిటో అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది. పాడేరు జిల్లా కేంద్రంలో గత నెల రోజుల నుంచి రెండు నిర్మాణాలు జరుగుతుంది.ఆ రెండు నిర్మాణాలు కూడా గిరిజనేతరులకు చెందిందే. కాగా అక్రమ నిర్మాణాలు చేస్తే వారికి గిడ్డి ఈశ్వరి అండదండలుగా నిలుస్తుందని బహిరంగనే మాట్లాడు కుంటున్న పరిస్థితి లేకపోలేదు. గుడివాడలో ఓ మహిళ పేరిట నిర్మాణం జరుగుతుంది.అదేవిధంగా క్రింద బజార్ శతకం పట్టు దగ్గర మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న నిర్మాణం చేపడుతున్నారు. అలాగే ఓల్డ్ బస్ స్టాండ్‌లో ఓ గిరిజనేతరుడు నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణదారులు బహిరంగానే మాకు గిడ్డి ఈశ్వరి అండదండలు ఉందని పబ్లిక్‌గా మాట్లాడుకుంటున్న పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పాడేరు పట్టణ రోడ్డు విస్తరణ పనుల్లో కూడా గిరిజనేతరుల పక్షన్న నిలబడి రోడ్డు వెడల్పు విస్తరణ పనులు గిడ్డి ఈశ్వరి నిలుపుదల చేసిందని ఆరోపణలు కూడా లేకపోలేదు. గిరిజనులకు ఏదైనా సమస్య వస్తే ఆ సమస్య పరిష్కారానికి కొంత ఆలస్యం అవుతుంది అదే ఓ గిరిజనేతరుడికి సమస్య వస్తే ఆగమేఘాలుగా అతుక్కుపోతుందని ఆరోపణలు కూడా లేకపోలేదు.గిడ్డి ఈశ్వరి గిరిజనులకు చవతి ప్రేమ చూపుతూ గిరిజనేతరులకు తల్లి ప్రేమ చూపుతోందని పలువురు గిరిజనులు గిరిజన మేధావులు గిరిజన సంఘాలు ప్రతిపక్షాలు బలంగా ఆరోపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత గిరిజనులు ఎవరు నాకు ఓటు వేయలేదని బహిరంగ మాట్లాడుకున్న సంఘటనలు కూడా లేకపోలేదు. ఇవన్నీ చూస్తుంటే గిడ్డి ఈశ్వరి ఎవరి పక్షము అర్థం అవుతుంది. ఇలాంటి నాయకులు వల్ల గిరిజన చట్టాలు హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం కూడా లేకపోలేదు. ఇప్పటికైనా పలు గిరిజన సంఘాలు గిరిజన మేధావులు గిరిజనులు మేలుకొని ఇటువంటి నాయకులతో పాటు గిరిజన ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణాదారులకు చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు గిరిజన హక్కులు చట్టాలను కాపాడాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

గుండెపోటుతో లైబ్రరీ అధ్యాపకురాలు మృతి

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని జోగమ్మపేటలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సంక్షేమశాఖ గురుకులంలో విధి నిర్వహణలో ఉన్నసమయంలోనే లైబ్రరీ అధ్యాపకురాలు మృతిచెందిన సంఘటన శనివారంనాడు చోటుచేసుకుంది. మండలంలోని బక్కుపేటగ్రామానికి చెందిన కె.రామలక్ష్మి(53) శనివారంనాడు విధుల్లోకి వచ్చిన తర్వాత లైబ్రరీగా ఉంటూ అదనంగా కేర్ టేకర్‌గా బాధ్యతలు నిర్వహించడంతో స్టోర్ రూంలో శనివారం మెనూకోసం సరిపోయిన ఆహారపదార్థాలను అందజేశారు. శనివారం నాగుల చవితి కావడంతో తనకు ఇష్టమైన ఇద్దరు విద్యార్థులకు రెండుగ్రుడ్లు పట్టుకొని వారితో కలిసి కళాశాల ఆవరణలో ఉన్న నాగేంద్రుని పుట్టవద్దకు ఉదయం 10 గంటల 10 నిమిషాలకు బయలుదేరేందుకు సిద్ధపడ్డారు. ఇంతలో ఒక్కసారిగా ఆమె స్టోర్ రూమ్ వద్దనే కుప్పకూలిపోవడంతో వెంటనే అక్కడ ఉన్నవిద్యార్థులు ప్రిన్సిపాల్, అధ్యాపకులు దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆమె గుండెపోటుతో కుప్పకూళారని తెలుసుకున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఈ పాఠశాలకి పక్కనేఉన్న ప్రతిభకళాశాలలో ఆమెభర్త బక్కు రామకృష్ణ పనిచేస్తుండగా ఆయనకు సమాచారం అందజేశారు. రామకృష్ణ హుటాహుటీనా పాఠశాలకు చేరుకోగా, వారంతా కలిసి వెంటనే పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొనివెళ్ళారు. అక్కడ చూసిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు బ్రాడ్ డెత్‌గా తెలిపారు. మృతి చెందిన రామలక్ష్మి 25 ఏళ్లనుండి సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో లైబ్రరీ అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు.2007లో ఆమెకు గురుకులంలో రెగ్యులర్ అయింది. ఉమ్మడి జిల్లాలో పలుగురుకులాల్లో ఆమె పనిచేశారు. మంచివ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా వారిద్దరూ ఐటీ విద్యను అభ్యసించారు. పెద్దవాడు సాయి స్వరూప్ ఢిల్లీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, రెండోవాడు ధీరజ్ కుమార్ నాగపూర్ ఐటీలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. వారిద్దరు పిల్లలు ఆదివారం ఉదయం చేరుకోవడంతో రామలక్ష్మి అంత్యక్రియలు నిర్వహించారు. మృతిచెందిన సంఘటన తెలుసుకున్న ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ మాణిక్యం, కళాశాల ప్రిన్సిపాల్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయ సిబ్బంది, నాన్ టీచింగ్ స్టాఫ్,విద్యార్థులు బక్కుపేట గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. ఆమెమృతి మరువలేనిదని తెలిపారు. ప్రతిభ కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. రెండువిద్యాసంస్థలలో భార్యాభర్తలకు మంచి పేరుఉండగా, వారిద్దరిలో రామలక్ష్మి ఆకస్మికమరణంతో రెండు గురుకులాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. ఆమె మృతిని చూసి రెండు విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు తీరుకోలేకపోతున్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర-పార్వతీపురం : మెంథా తుఫాను నేపథ్యంలో జిల్లాలో మోస్తారు నుండి భారీ వర్ష వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వలన ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగరాదని, ఇందుకోసం ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సో స్పష్టం చేశారు. జిల్లా అధికారులకు శాఖల వారీగా విధులను కేటాయించడం జరిగిందని, అధికారులకు అప్పగించిన బాధ్యతలను తూ.చ పాటించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదీ లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 27 నుంచి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం, పశువులను కడగడం, ఇసుకను త్రవ్వడం వంటి పనులు చేపట్టరాదని తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి పంట నష్టం జరగకుండా చూడాలని, పంట కాలువలు, గట్లు తెగిపోకుండా ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టుప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. శిథిలావస్థలోని భవనాలు, పాఠశాలల్లో ఎవరూ లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు ఆరుబయట తిరగకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల పట్ల విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం పట్ల ఆయాశాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేశామని ఆయన చెప్పారు. ప్రజలు సమాచారం పొందడం, తీసుకోవడం చేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

పాఠశాలలకు మూడు రోజులపాటు సెలవులు : వాతావరణశాఖ అధికారుల సూచనల మేరకు రాబోయే మూడు రోజులు మెంథా తుఫాను వల్ల రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశాల మేరకు ఈనెల 27 నుండి 29 వరకు మూడు రోజులపాటు జిల్లాలలోగల అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉప విద్యా శాఖాధికారులకు, మండల విద్యాశాఖాధికారులు అందరూ కూడా మండల పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసుకొని మండల విద్యాశాఖాధికారులు 1&2 ఇద్దరుకూడా 24 గంటలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందరూ అందుబాటులో ఉంటూ మండల విద్యాశాఖాధికారులకు సహకరించవలెనని చెప్పారు. విద్యాశాఖ అధికారులకు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సెలవులు లేవని తెలిపారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం సరికాదు

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ నగర పంచాయతీలోని 15,16,17,19,వార్డులలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ కార్యక్రమం సంత మార్కెట్లో ప్రారంభించారు,కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు పాలవలస విక్రాంత్,మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాల్గొన్నారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విద్య వైద్యం ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు తీరని నష్టం కలిగిస్తుందని ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరణ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని దీనిని ప్రతి ఒక్కరు ప్రతిఘటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు,కడగల రమణ, కిల్లారి మోహన్, తుమ్మగుంట శంకరరావు, మరియదాస్, లిల్లీపుష్పనాదం, కోడెం బాబీ, పల్లా భాను,సీలాపు శ్రీను, కోరాడ సూర్యనారాయణ, కె.విజయకుమార్, మిడితాన సూర్యనారాయణ, గార వెంకటరమణ, తుంబలి వాసుదేవరావు, దాసరి నాగేశ్వరరావు, గెద్ద చిన్నం నాయుడు,భాసూరు కాంతారావు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జీకే వీధి : వైయస్సార్సీపి అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అల్లూరి సీతారామ రాజు జిల్లా వైసీపీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస

విశ్వేశ్వరరాజు సూచనలు మేరకు వైసీపీ సీనియర్ నాయకులు పలాసి చిన్నారావు, మామిడి గోపాల్, దేశగిరి మురళి, దేశగిరి వీరన్న పడాల్ ఆధ్వర్యంలో ఆదివారం రింతాడ పంచాయితి అసరాడ గ్రామంలో ప్రభుత్వమెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ నెల 28 దిన పాడేరు లో జరిగే ఈ ప్రజపోరు కార్యక్రమం జయప్రదం గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో దేవరాజు చిన్నతల్లి, దేసగిరి మురళీ, మామిడి గోపాల్ తది తరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో విద్యుదాఘాతం

విశాలాంధ్ర-జిమాడుగుల : మండల కేంద్రంలో గల యూనియన్ బ్యాంకులో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయ్యి బ్యాంకులో ఉన్న విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. జి మాడుగుల మండల కేంద్రంలోగల యూనియన్ బ్యాంక్‌లో ఆదివారం సెలవు కావడంతో సిబ్బంది ఎవరు లేకపోవడంతో సాయంత్రం 6గంటల సమయంలో ఒక్కసారిగా బ్యాంకులో మంటలు చెలరేగడంతో స్థానిక యువకుడు కోర్ర క్రాంతి కుమార్ చాకచక్యంగా వ్యవహరించి బ్యాంకులో ఉన్న ఫైర్ సిలిండర్లు తీసుకొని మంటలు అదుపు చేశాడు . బ్యాంకులో కంప్యూటర్ అలాగే ప్రింటర్, ఏసీ వివిధ వస్తువులు కాలి బూడిదయ్యాయి, యువకుడు క్రాంతి కుమార్ వచ్చి మంటలు అదుపు చేయలేకపోతే, చాలా నష్టం జరిగేదని స్థానికులు తెలుపుతున్నారు. క్రాంతి కుమార్ చాకచక్యంగా మంటలు అదుపు చేశాడని స్థానికులు మెచ్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న బ్యాంక్ మేనేజర్, అలాగే స్థానిక ఎస్సై షణ్ముఖరావు సంప్రదించి వివరాలను తెలుసుకున్నారు.

గంజాయిపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : గ్రామంలో గల గిరిజన బాలుర వసతి గృహం,బాలికల వసతి గృహంలో ఆదివారం పోలీస్ లు గంజాయి వలన కలిగే నష్టాలను వివరించారు,గంజాయి త్రాగిన, రవాణా చేసిన జీవితం నాశనం అవుతుందని, గంజాయితో దొరికితే సగం జీవితం జైల్లో గడపాల్సి వస్తుందని,కాబట్టి విద్యార్థులు ఎవరు గంజాయితో పాటు ఎటువంటి మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని తెలిపారు,ఎవరైనా గంజాయి తరలిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే హెల్ప్ లైన్ నంబరు ధ్వారా పోలీస్‌లకు తెలియజేయాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల దారి శుభ్రం

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి వెళ్లే రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోవడంతో బిజెపి నాయకులు బోటు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మెయిన్ రోడ్డు దుఖానదారులు వ్యర్థాలను పాఠశాల దారిలో వేయకుండా ఉండాలని సూచించారు. చెత్త అధికమొత్తంలో పేరుకు పోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : మండలంలో గల పోలీస్‌స్టేషన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులతో ఓపెన్ హౌస్ ప్రోగ్రామ్ నిర్వహించామని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ జే.రామక్రిష్ణ తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగలను గుర్తు చేస్తూ దానిపై వివరించారు ఇందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పోలీస్ విధులు నిర్వహణ పట్ల ఎలా నిర్వహించలో మరియు వెపన్స్ అండ్ కమ్యూనికేషన్ సిస్టం గురించి వివరించాడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ మరియు ఏపీఎస్పీ సిబ్బంది మరియు సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెంథా తుఫాను పట్ల పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి

విశాలాంధ్ర-కురుపాం : మంథా తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని తుఫాను హెచ్చరికలు జారీ చేసిన నేపధ్యంలో మండలం లోని 20 గ్రామ సచివాలయాల పరిదిలోని పంచాయతీ కార్యదర్శి లు ,మండల పరిషత్, తాగు నీరు, వైద్య, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూనే ప్రజలకు ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు అన్ని యాజమాన్యాలు మూడు రోజులు సెలవులు ప్రకటించాలని, సూచించారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

విశాలాంధ్ర -కురుపాం : యువత మాదకద్రవ్యాలు వినియోగానికి దూరంగా ఉంటూ సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.నారాయణరావు సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో ఈగల్ టీం ఆధ్వర్యంలో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు లోనుకావడం వలన జరిగే నష్టం వివరించారు. ఉత్తమ లక్ష్యంతో విద్య అభ్యసించాలని కోరారు. అలాగే ఇటీవల పెరిగిన సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వారి నుంచి వచ్చిన ఎపికె, ఫోన్ కాల్స్‌పై స్పందించవద్దని సూచించారు.

వ్యవసాయ రంగంలో సమస్యలపై రైతులకు అవగాహన అవసరం

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త బయ్యపురెడ్డి

విశాలాంధ్ర-చింతపల్లి : వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై రైతులకు అవగాహన అవసరమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బయ్యపు రెడ్డి అన్నారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మండల వ్యవసాయ శాఖతోపాటు, స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త లతో కలిసి వరి పొలాలను పరిశీలించి పురుగులు మరియు తెగుళ్ళ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అదే క్రమంలో ఈ క్రాప్ బుకింగ్ కూడా చేయించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హుస్సేన్ రెడ్డి, జోగారావు, టాటా ట్రస్ట్ అప్పలరాజు, వీ హెచ్ ఏ చంద్రకళ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక కారణాలతో పీఎం జన్మన్ గృహాలు బిల్లులు ప్రభుత్వం నిలుపుదల

మండల గృహ నిర్మాణ శాఖ అధికారి పసుపులేటి లక్ష్మి విమల

విశాలాంధ్ర-జీకే వీధి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో అమల జరుగుతున్న పీఎం జన్మన్ పథకంలో గృహ లబ్ధిదారులకు సంబంధించిన సాంకేతిక కారణ దృష్ట్యా గృహాలు మొదలుపెట్టడానికి సాధ్యపడటం లేదని మండల గృహ నిర్మాణ శాఖ అధికారి పసుపులేటి లక్ష్మీ విమాల అన్నారు. ఈ సాంకేతిక సమస్య పరిష్కరించాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ద్వారా లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని పిడి తెలిపారని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం సాంకేతిక సమస్య పరిష్కరించిన వెంటనే పైన పేర్కొన్న గృహ లబ్ధిదారులందరికీ గృహాలు మంజూరు కానున్నాయి. సాంకేతిక సమస్య ఉత్పనం అయినా లబ్ధిదారులు ఎట్టి పరిస్థితులను ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలియజేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రగతిలో ఉన్న లబ్ధిదారులు కూడా ఈనెల 8వ తేదీ నుండి పరిపాలన సంబంధిత సాంకేతిక కారణం దృష్ట్యా ప్రభుత్వం బిల్లులు నిలుపుదల చేసి ఉందని ఈ సాంకేతిక లోపాలను లబ్ధిదారులు గుర్తించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

మన్యవాసులకు పిలుపునిచ్చిన జడ్పిటిసి సభ్యుడు బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల పట్ల మన్యప్రాంత వాసులంతా అప్రమత్తంగా ఉండాలని జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. తన కార్యాలయంలో ఆపార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్, వైకాపా జీకే వీధి మండల మాజీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మన్య ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ అకాల వర్షాల వలన పంటలు దెబ్బ తినే పరిస్థితి ఉందన్నారు. ఈ అల్పపీడనాల వలన వ్యవసాయదారులే గాక ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. తుఫాను హెచ్చరిక కేంద్రాల నుండి జాగ్రత్తగా ఉండాలని సంకేతాలు వస్తున్నందున ప్రభుత్వాలు కూడా అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. మన్య ప్రాంతంలో వాగులు పొంగిపొర్లే పరిస్థితి ఉన్నందున వారపు సంతలకు వెళ్లేవారు. అదేవిధంగా అత్యవసర సమయాలలో ఆసుపత్రులకు వెళ్లేవారు అప్రమత్తంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అదేవిధంగా అత్యవసర సమయాలలో పార్టీ శ్రేణులంతా ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

వ్యాధులపై అవగాహన తప్పనిసరి

- విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- ఆర్.బిఎస్.కె పిఓ డాక్టర్ జగన్ మోహన్

విశాలాంధ్ర-బెలగాం : వ్యాదులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఆర్.బిఎస్.కె అధికారి డాక్టర్ టి జగన్ మోహనరావు సూచించారు. గూడ్స్ షెడ్ రోడ్‌లో (14వ వార్డు) గల గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలుర హాస్టల్ ను ఆదివారం సందర్శించారు. హాస్టల్ ప్రాంగణం, పరిశుభ్రతపై పరిశీలించారు. విద్యార్థుల్లో ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఉన్నారా అని వార్డెన్ ను అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్ నిర్వహణపై తనిఖీ చేసి అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్య సమాచారం తెలుసుకొని ఆసుపత్రిలో అందజేసిన చికిత్సా వివరాలు ఓపి చీటిలో పరిశీలించారు. సిక్ రిజిస్టర్ పరిశీలించారు. హిమోగ్లోబిన్ రికార్డు తనిఖీ చేసి ఐరన్ మాత్రలు వేయిస్తున్న విధానంపై ఆరా తీశారు. త్రాగునీటి సదుపాయంపై వార్డెన్ అడిగి తెలుసుకున్నారు. నీటి నాణ్యతా పరీక్షలపై ఆరా తీశారు. ప్రతీ వారం హాస్టల్ లో డ్రైడే నిర్వహించాలన్నారు. అనంతరం పలు ఆరోగ్య అంశాలపై ఐఈసి ప్రదర్శిస్తూ డాక్టర్ జగన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులను తరచుగా పరిశుభ్రం చేసుకోవాలని, పరిశుభ్రమైన నీరు నిర్ణీత వ్యవధిలో త్రాగుతూ ఉండాలన్నారు.రక్తహీనత, సీజనల్ వ్యాదులు, కామెర్లు, పరిశుభ్రత, రోగనిరోధక శక్తిపై వివరించారు. విద్యార్థుల్లో ఏ చిన్న అనారోగ్య లక్షణాన్ని గుర్తించినా తక్షణమే పరీక్షలు చేయించి చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ టి. కృష్ణమోహన్, సూపర్వైజర్ జయగౌడ్ వైద్య సిబ్బంది ఉన్నారు.

సాధన సమితి నాయకులు రౌతు సోంబాబు మృతికి ఘన నివాళులు

విశాలాంధ్ర-పాలకొండ : తోటపల్లి కాలువల ఆధునీకరణ పనుల సాధన సమితి నాయకులు, మాజీ ఎంపీటీసీ, లుంబురుగ్రామ మాజీ సర్పంచ్, గుడివాడ నీటి సంఘం అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటర్ కమిటి వైస్ చైర్మన్ రౌతు సోంబాబు భౌతికాయానికి తోటపల్లి కాలువల ఆధునీకరణ పనుల సాధన సమితి కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తో కూడిన ప్రతినిధివర్గం ఆదివారంపూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు,ఈ సందర్భంగా ప్రతినిధి బృందం మాట్లాడుతూ రౌతు స్వామిబాబు రైతుల కోసం ఎన్నో సేవలు అందించారని ఈయన మృతి యావత్తు రైతాంగానికి తీరనిలోటని అన్నారు, నివాళులు అర్పించిన వారిలో, చేబొదుల లక్ష్మీనారాయణ (సాధన సమితి అధ్యక్షులు)అల్లు శ్రీరాంమూర్తి, గురుబిల్లి అప్పలనాయుడు, మామిడి రంగారావు,పామోటి వైకుంతరావు, బి.వి రమణ, కిమిడి రామ్మూర్తినాయుడు, బలగ దుర్గారావు, రైతులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు శక్తి టీంలు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం పార్వతీపురం సబ్ డివిజన్ ఎఎస్పీ అంకిత సురాన ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది ఆదివారం పార్వతీపురం పట్టణంలో వున్నటువంటి ఇందిరా కాలనీలోని బాలుర వసతి గృహం, గూడ్స్ షెడ్ రోడ్డులో గల ప్రభుత్వ గిరిజన బాలుర బాలుర వసతి గృహం, బైపాస్ కాలనీ లోని బాలికల బాలుర వసతి గృహం, పార్వతీపురం పట్టణ పరిధిలో ఉన్న విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్ 1930, డ్రగ్స్ 1972, డయల్ 112 సేవలపై మహిళల రక్షణ చట్టం మరియు బాల్య వివాహం 1098, మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని తెలియచేస్తూ ప్రతి ఒక్క విద్యార్థిని తన యొక్క మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్ పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీం 1%ఉ%2 ఇంచార్జ్ మరియు ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు (1154), మహిళా కానిస్టేబుళు (డబ్ల్యూపిసి) రామలక్ష్మి, పద్మ, నిర్మల, శక్తి టీం పాల్గొన్నారు.

మరణించిన విద్యార్థులు కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

ట్రైబల్ రైట్స్ ఫోరమ్ డిమాండ్

విశాలాంధ్ర-కురుపాం : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే 10 లక్షల ఆర్థిక సహాయం అందించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాసం కల్పించాలని టి ఆర్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ఓట్లతో గెలిచి ఎమ్మెల్యేలు మంత్రి అయినప్పటికీ గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే కనీసం వారికి చీమకుట్టినట్టైనా లేదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే గిరిజన విద్యార్థులు మరణాలకు బాధ్యత వహిస్తూ ఆర్థిక సహాయం అందించి గిరిజన కుటుంబాలకు ఆదుకోవాలని టిఆర్ఎఫ్ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఘనంగా సనారీ విశ్వేశ్వర స్వామి వారి జయంతి వేడుక

విశాలాంధ్ర-పాలకొండ: పాలకొండ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన జగద్గురు సనారీ విశ్వేశ్వర అన్నపూర్ణాంబ వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ పాడి ఆధ్వర్యంలో నిర్వహించారు,ఈ కళ్యాణ మహోత్సవం ముందూరు సంతోష్ కుమార్ దంపతులతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు,అనంతరము ఆలయ ప్రాంగణంలో మహా నారాయణ సేవ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టేకి ప్రసాదరావు టేకి రామకృష్ణ గోన్నభక్తుల ప్రకాశరావు కాకినాడ శ్రీనివాసరావు పెద్దప్రోలు కిరణ్ రీసు రవికుమార్ పండూరు శ్రీనివాసరావు పండూరు కృష్ణారావు పట్టణ స్వర్ణకారుల సంఘ సభ్యులు మరియు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు: మెంథా తుఫాన్ పట్ల అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి సంధ్యారాణి సూచించారు. ఈ మేరకు మన్యం, అల్లూరి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడినట్లు మంత్రి ఒక ప్రకటన లో తెలిపారు. పై రెండూ జిల్లాలో నేడు జరగనున్న గ్రీవెన్స్ ను రద్దుచేయాలని సూచించారు. అన్నిమండలాలలోకంట్రోల్‌రూమ్స్ఏర్పాటుచేసిపరిస్థితినిఎప్పటికప్పుడుసమీక్షించాలని సూచించానన్నారు.వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.విద్యార్థుల భద్రత దృష్ట్యా అవసరం మేరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలని తెలిపారు.గిరిజన ప్రాంతాల్లోవిద్యుత్‌సరఫరాకుఅంతరాయంకలగకుండాముందస్తుచర్యలుతీసుకోవాలన్నారు.రైతులు,మత్స్యకారులుముందస్తుజాగ్రత్తలుతీసుకోవాలన్నారు.సహాయక చర్యలు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

మెంథా' తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-ఎటపాక : మెంథా' తుపాను పట్ల అప్రమత్తంగా ఉండలని ఎటపాక సిఐ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఏటపాక సర్కిల్ పరిధిలోని మండలాల ప్రజలకు మంత్ తుఫాన్ కారణంగా పోలీస్ వారి సూచనలు జారీచేశారు. మొంథా' తుఫాన్ కారణంగా పాపికొండల యాత్రలు నిపివేశారని, కావున యాత్రికులు ఎవరు కూడా ప్రయాణం చేయకుండా ఇంటివద్దనే ఉండవలనీ, మూడు రోజుల నేడు, రేపు, ఎల్లుండి వరకు స్థానిక ప్రజలు ఎటువంటి ప్రయాణాలు చేపట్టవద్దని, ఇతర పనులు పెట్టుకోకుండా ఇంటి వద్దనే సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. స్థానిక నాయకులు అందరూ ఈ తూఫాన్ పై అప్రమత్తంగా వుండి, పోలీస్ రెవెన్యూ వారితో కలిసి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ముఖ్యంగా చెరువులు, వాగులు, కాలువలు వద్దకు స్నానాల కొరకు గానీ, చేపల వేట కొరకు గానీ ప్రజలు వెళ్ళవద్దని హెచ్చరికలు జారీచేశారు. ముఖ్యంగా ఏటపాక ,కూనవరం మండలాలకు అధిక వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీచేయబడినవి. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండవలన్నారు. ఎటపాక, కూనవరం, విఆర్ పురం మూడు మండలాల్లో తాసిల్దార్ కార్యలయం నందు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. సంప్రదించవలసిన ఫోన్‌నెంబర్లు. ఎటపాక : 8885425365, 8309029520, విఆర్ పురం 8008100892, కూనవరం 9652814712 ఫోన్ నెంబర్లూ సంప్రదించాలన్నారు.

తెలుగుదేశం బీసీ సెల్ అధ్యక్షుడిగా నాగరాజు

విశాలాంధ్ర -కూనవరం:తెలుగుదేశం పార్టీ కూనవరం మండలం బిసి సెల్ మండల అధ్యక్షుడుగా భీమవరం గ్రామానికి చెందిన ముప్పెనబోయిన నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కర్ రావు, మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు సమక్షంలో కార్యకర్తలు నాగరాజును ఎంపిక చేశారు. గతంలో తెలుగు యువత కోసం పనిచేసిన నాగరాజు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని,కష్టపడి పని చేసే వారికి పార్టీ ఎప్పుడూ తగిన గుర్తింపు ఇస్తుందని వారన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన ఈ బాధ్యతకోసం నిస్వార్థంగా పని చేస్తానని, ఈ అవకాశం ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బందారు శివయ్య, చెలికాని ఉమా, ఎచ్చు రాము, ఎస్కే షరీఫ్, గొట్టాల రామకృష్ణ, పరిటాల భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలు... ప్రభుత్వ హత్యలే

హడ్డు బంగి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మరణించిన విద్యార్థి కుటుంబానికి రూ 50 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలి
- ఎస్ఏఫ్ఐ డిమాండ్

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏ పరిధిలో గల మల్లి ఆశ్రమ హాస్టల్లో నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు బి. అనిల్,కే, కృష్ణ మాట్లాడుతూ, పార్వతీపురం మన్యం జిల్లా విద్యారంగ సమస్యల పరిష్కారానికి జిల్లావ్యాప్తంగా జీపు యాత్ర ఈనెల 23నుండి 29 తేదీ వరకు జరుగుతుది. ఏ ఎన్ ఎమ్ లు ను నియమించాలని, పాఠశాలలులో మౌళిక సౌకర్యలు కనిపించాలని తెలిపారు.హడ్డు బంగి ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి మండంగి. కవిత కే జి హెచ్ ఆసుపత్రి లో మారని విద్యార్థి కుటుంబంకు రూ 50 లక్షలుపరిహారం చెల్లించాలని తెలిపారు. ఈ మధ్య కాలంలో చదువు కోసం విద్యార్థులను పాఠశాలలుకు పంపిస్తే అనారోగ్యం కు గురిఅయి మరణిస్తున్నారు అన్నారు. ఇప్పటివరకు కురుపాం గురుకుల పాఠశాలలో 7 రోజుల్లో పి.అంజలి, టీ.కల్పన అనారోగ్యంతో కేజీహెచ్ మృతి చెందారు. రామభద్రపురంలో బి.ఈశ్వర్ రావికోనలో పి.రాఘవ కొమరాడ కేజీబీవీలో కే.శారద, గుమ్మలక్ష్మీపురం బాలికల పాఠశా లలో ఎన్ అవంతిక, బాలుర పాఠశాలలో నితిన్ రా0భద్రపురంలో జీవన్ కుమార్ దొరజామ్ము జి.దినేష్ టీకే జమ్ము లో కె. తనూజ సాలూరు బాలికల కళాశాల హాస్టల్లో అనిత, మామిడిపల్లి ఆశ్రమం పాఠశాలలో, ఎర్ర సామంతన వలసలు చిన్నారి 14 మంది విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారు.

హాస్టల్ కంటే జైలు మిన్న : గురుకుల పాఠశాలలో 611 మంది విద్యార్థులుకు 16 రూములు ఉంటున్నారు ఒక రూమ్ కి 40 మంది విద్యార్థులు ఉంటారు. క్లాస్, వసతి గృహ తిండి అక్కడే చెయ్యాలి. చాలీచాలని రూముల్లో ఉంటున్నారు. సురక్షితమైన మంచినీరు లేదు. ఆర్వో ప్లాంట్ ఉన్న పని చేయటం లేదు. మరుగుదొడ్లు పదిమందికి చెప్పిన ఒకటి ఉండాలి. 30 మాత్రమే ఉన్నాయి. డ్రైనేజ్ కాలువ లేక నీరు మరుగుదొడ్లు నిలవ ఉంటుంది. అందువ ల్ల వాటర్ బయటికి వెళ్ళక చెడు వాసన వస్తుంది. నీరు కలుషితమై విద్యార్థులకు పచ్చకామర్లు వచ్చాయి. జిల్లాలో అన్ని ఆశ్రమ గురుకుల హాస్టల్ లో ఇదే దుస్థితి నెలకొంది.

55 రూపాయలతో పౌష్టికాహారం దించడం సాధ్యమా!! ప్రభుత్వ ఒక విద్యార్థికి రోజుకి 55 రూపాయలు ఖర్చు చేస్తుంది మూడు పూటలు భోజనం అంటే పూటకి 18 రూ ఖర్చు చేస్తుంది. మోడీ పుణ్యమా అని ధరలు ఆకాశానికి పెరిగాయి. నిత్యవసర సరుకులు గ్యాస్ పెరిగింది. పెరిగిన ధరలు అనుగుణంగా ంగా చార్జీలు పెంచాలి. పెంచలేదు. అందుకు చాలీచాలని ఆహారం రుచికమైన కూరలు అరకొర మెనూ అమలు చేస్తున్నారు. ఇప్పటికే అనేక సర్వేలు 100 మంది జన్మిస్తే 90 మంది రక్తహీనతతో బాధపడుతున్నారని ప్రభుత్వం చెబుతోంది. పౌష్టికాహారం అందక విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని ప్రభుత్వానికి తెలిసిన చలనం లేదు. జైల్లో ఉన్న ఖైదీకి రోజుకి 80 రూపాయలు ఖర్చు చేస్తుంది. ఎమ్మెల్యే కి రోజు కి 2500 ఉంటుంది. దీన్నిబట్టి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఎవరికి ఎంత ఇస్తుందో అర్థమవుతుంది. పౌష్టికాహారం మంచి ఆరోగ్యం లేకుండా విద్యార్థి బాగా ఎలా చదువుతారు ప్రభుత్వమే చెప్పాలి.

పర్యవేక్షణ లోపం : ఏ టి డబ్ల్యూ, డిడి,గురుకుల ఓ ఎస్ టి, ప్రతినెల హాస్టల్ కు వెళ్లి విద్యార్థులు యోగక్షేమాలు చూడాలి. అధికారులు పర్యవేక్షణ లేనియెడల వారిపై పిఓ కలెక్టర్ చర్యలు తీసుకోవాలి. నేడు అలాంటి పరిశీలన కరువయ్యింది. పై స్థాయి నుండి క్రింది వరకు అధికారులు విద్యార్థులు యోగక్షేమా లు చూసుకుని నాధుడే లేడు. విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తే హడావిడిగా హాస్టల్స్ కి సందర్శించి వారు తప్పుని తప్పు పుచ్చుకొని కింద స్థాయి వార్డెన్,హెచ్ఎం,హెల్త్ వాలంటరీల మీద నెట్టి బాధ్యతల నుండి తొలగిస్తున్నారు. చాలా దుర్మార్గం. అలాగే స్కూలు నిర్వహణ కోసం నిధులు కేటాయించాలి. గిరిజన శాఖ మంత్రి మొదటి సంతకం అమలు ఎప్పుడు చేస్తారు. ప్రభుత్వం ఏఎన్ఎంలు నియమించకపోతే విద్యార్థుల ప్రాణానికి ప్రమాదం ఉంది.

ఎక్స్గ్రేషియా 50 లక్షలు/ఉద్యోగం ఇవ్వాలి : అనారోగ్యంతో మరణించిన 14మంది విద్యార్థులకు వారి కుటుంబ సభ్యులకు 50 లక్షలు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. ఇచ్చేంతవరకు ఐక్యంగా విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ప్రశ్నించాలి పోరాటానికి సిద్ధం కావాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి చేస్తుంది. పోరాడే ఎటువంటి హక్కులైనా సాధించుకోగలరు మనకి మన విద్యార్థులు ప్రాణానికి రక్షణ కల్పించే అంతవరకు పోరాటం చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యులు శరత్,నాయకులు దినేష్,టి. అఖిల్ తదితరులు పాల్గున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు

విశాలాంధ్ర-దేవీపట్నం : స్వాతంత్రం వచ్చి 78సంవత్సరాలు దాటినా గిరిజనాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉంది అనే నానుడి ఆ గ్రామాలు ప్రతీక .అదంతా పాపికొండల అభయారణ్యం ఎటు చూసిన దట్ట మైన కొండలు అక్కడక్కడ విసిరేసినట్టు ఉండే గిరిజన గ్రామాలు. అధికారుల సవతి ప్రేమ కు అదే నిదర్శనం వారిలో వెనుక బాటు తనం మారుతున్న గిరిజనాభివృద్ధి లో మార్పు రాకపోవడానికి కారణం పాలకులు -ప్రజా ప్రతినిధులు ఐదు సంవత్సరాల కో సారి కన్పించి మెరుపు తీగలా వెళ్లి పోతారు. వీరి ఆలనా పాలనా వారికి పట్టదు. ఉన్నారో లేరో కూడా వారికి పట్టదు. వారి అభివృద్ధి పై ఆలోచన చేయాలి. రోజులు మారుతున్న స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా లోపం ఎక్కడుంది. ఐదు సంవత్సరాలకోసారి వచ్చే ఎన్నిక్షలు అక్కడ గిరిజన జీవితాలును వారి స్థితిగతులను జీవన విధానాన్ని మార్చలేవు. ఇప్పటికి ఎన్నికలు అయి రెండు సంవత్సరాలు అయినా ఎమ్మెల్యే ఆ గ్రామాలకు వెళ్లక పోవడం గమనార్హం. గిరిజనులకు ప్రత్యేక వ్యవస్థ ఉండి ప్రత్యేక సాధికార సంస్థ ఉండీ గిరిజనాభివృద్ధి కి ఆ సంస్థ పెద్ద పీట వేస్తున్న అభివృద్ధి లో ఆమడ దూరంలో ఉన్నామంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.నేటికీ విద్య -వైద్య ఆరోగ్య - - మౌలిక సదుపాయాలు విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది ఇక్కడ పరిస్థితి. వివరాల్లోకి వెళితే దేవీపట్నం మండలం లో చొప్పకొండ యర్రమెట్ల సిఏచ్ గంగవరం పెద్ద నూతులు పంచాయతీ లు కొండరెడ్డి పి టి సి సామాజిక వర్గాలకు చెందిన గ్రామాలు. ప్రభుత్వం పరంగా వీరికి పెద్ద పీట వేస్తారే తప్ప అభివృద్ధి లో వెనకబడిన గ్రామాలు గా విద్య -వైద్యం -ఆరోగ్యం -రవాణా సౌకర్యం లు మాత్రం అంతంత మాత్రమే.నేటికీ కొంతమంది గిరిజనులు సర్కారు వైద్యం పొందలేక పసరు వైద్యం పైనే ఆధార పడి ప్రాణాలు మీదకే తెచ్చుకుంటున్నారు. రోడ్డు సదుపాయం లేక కొండ వాగులు అడుగడుగునా అడ్డం పడుతూనే ఉంటాయి. వర్షం వచ్చి వాగులు పొంగితే అంతే సంఘుతులు తగ్గే వరకు ఎక్కడ వారు అక్కడే.ఆదివారం రంపచోడవరం వారపు సంతకు వారమంతా చూడని ఎర్ర బస్ ను చూస్తారు అది కూడా పది పదిహేను కిలోమీటర్లు దాటి ఎక్కాలి.మండల కేంద్రానికి వెళ్ళాలి అంటే కత్తి మీద సామే. రంపచోడవరం తిరగేసుకొని డబ్బయ్, ఎనభై కిలోమీటర్లు దాటి వెళ్ళాలి. ఆ రోజు కా రోజు పని అవ్వక పోతే వారి కష్టాలు అన్నీ ఇన్నీ కాదు.సామాన్యులుకే గాదు విధి నిర్వహణ పక్కాగా చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగులు పరిస్థితి వర్ణాతీతం.మారుతున్నా సమాజం లో చదువుకున్న ఒకరు ఇద్దరు లో కన్పించినా అక్షరాశ్యత వారి అభివృద్ధి నిరోధకంగా మారుతుంది. మరి వారు ఎదగటం మారుతున్న ప్రపంచాన్ని అందుకోవటానికి ఎంత కాలం పడుతుందో వేచి చూడాలి.

మన్యంలో నేరాల నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర-సీతంపేట: మండలంమన్యంప్రాంతంలో నేరాలు నియంత్రణపై సబ్ ఇన్స్పెక్టర్ వై. అమ్మనరావు ప్రజలకుఅవగాహనకల్పించారు. ప్రజలు ఆన్ లైన్ మోసాలకు గురి కావద్దని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దు అని తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మన్యంలో నాటు సార తయారు చేయరాదు, అమ్మకాలు జరప రాదని తెలిపారు. మైనర్ లుకు వాహనాలు ఇచ్చి ప్రమాదాల గురు కావద్దని అవగాహన కల్పించారు. అదే విధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

విశాలాంధ్ర-జి.మాడుగుల : పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని మండలంలో ని విద్యార్థులతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ బి. శ్రీనివాస రావు, ఎస్ ఐ షణ్ముఖ రావు వివిధ వేపన్స్ వినియోగం పై వివరించారు. అలాగే ఫ్రెండ్లి పోలిసింగ్ లో భాగంగా ప్రజలకు,పోలీసులకు మధ్య సత్సంబంధాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ కార్యక్రమం

విశాలాంధ్ర- వీరఘట్టం: మండల కేంద్రంలో , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు పాలవలస విక్రాంత్ , మాజీ శాసన సభ్యులు విశ్వాసరాయి కళావతి .ఈ కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు , కర్రి లీలాప్రసాద్ ,దిబ్బ లలిత కుమారి , కళింగ ప్రేమ్ భూషణ్ ,వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి ప్రపంచ విపత్తును దానివలన సంభవించిన ఆర్థిక నష్టాలను రెండేళ్లపాటు ఎదుర్కొని మరోవైపున నాడు నేడు తో ఆసుపత్రులు అభివృద్ధి చేసి వైద్య రంగ చరిత్రలో ఎన్నడు లేని విధంగా 50,000 మంది ఉద్యోగ నియమకాలు చేపట్టి 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చి అందులో ఏడు పూర్తి చేసి ఆరోగ్యశ్రీ పరిధిని పెంచి ప్రజలను కన్న బిడ్డలవలె కాపాడినది నాటి జగన్ ప్రభుత్వం.ఏది మంచి ప్రభుత్వమో, ఏది ముంచే ప్రభుత్వమో ఇప్పటికైనా గ్రహించాలన్నారు.ఆరోగ్యశ్రీని ఆపేసి మెడికల్ కాలేజ్ లను సైతం ప్రైవేటుకు అప్పగిస్తూ పేద మధ్యతరగతి ప్రజలకు వైద్యవిద్యను,వైద్యాన్ని దూరం చేస్తుంది ఈ కూటమి ప్రభుత్వం ఈలాంటి ప్రభుత్వం అవసరమా అని అన్నారు.కోటి సంతకాల మహా యజ్ఞంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.